# కథకుని కథ ★

రచన :
శ్రీ యన్నంరెడ్డి వెంకట రెడ్డి.

''ఆగడ్తలో పడిన పిల్లికి అదే వైకుంఠమంట! అలాగే నన్ను తీసుకొచ్చి హఠాత్తుగా యింత మంది పెద్దల ఎదుట సభాస్థలిలో నిలబెట్టారు. అగ్నిలో మిడత పడ్డట్టు నేను కొట్టుమిట్టాడుతుండగా, మీరంతటిది చాలదన్నట్లు నేనెలా రచయితనయిందీ చెప్పమంటున్నారు. అసలు 'మీరెలా రచయితయ్యా'రని నిలబెట్టడిగితే నేనే కాదు, ఏ రచయితయినా దానికి జవాబు చెప్పడం కష్టమే. అదలా ఉంచి మీకు నా మీదున్న అభిమానానికి నా మనస్సు ఆనందంతో ఉప్పొంగుతోంది మీరిలా సన్మానిస్తారని నేనెన్నడూ ఊహించలేదు, అది నా అదృష్టంగా భావిస్తున్నాను.

సరే! నా అభిమానులు, నా సోదరులు నన్నింతగా ఆదరిస్తూ ఉంటే మీ కోరికను తీర్చటం నా కనీస కర్తవ్యం!

నా చిన్నతనం నుంచీ పుస్తక పఠనం పట్ల ఎక్కువ మక్కువ చూపే వాణ్ణి. అదే నన్నింత వాణ్ణి చేసిందని నా నమ్మకం. అయితే నేనూ అలాంటి పుస్తకాలు వ్రాయాని, నాకూ అంత పేరు రావాలి, నేనూ పది మందిచే గొప్ప వాణ్ణనిపించుకోవాలీ__ఈ కోరికలే నా పసిహృదయంలో అంకురించాయి. ఆనాటి నుంచీ దొరికిన పుస్తకమల్లా ఎంత పని విడిచి పెట్టయినా సరే చదివే వాణ్ణి. అలా చదవడం మూలాని నాలో కాస్త భాషా పరిజ్ఞానం ఏర్పడిందనే చెప్పాలి. నాలో వ్రాయాలన్న కోరిక మొలకెత్తింది.

వ్రాయాలని ఉంది, ఏదో వ్రాయాలని ఉంది. కాని, ఏమని వ్రాయాలి? ఎలా వ్రాయాలి? ఎవరి మీద వ్రాయాలి? దేనిగురించి వ్రాయాలి, ఇదే నన్ను వేధించి బాధిస్తున్న యక్ష ప్రశ్నలు. ఈ నా ప్రశ్న పరంపరలు ఆధారం చేసుకుని 'ఏదో వ్రాయాలని ఉంది' అనే గేయం మొట్టమొదట వ్రాశాను. అంతే: నాలో అవ్యక్తంగా దాగిఉన్న ఊహాలన్నింటిని బయట పెట్టాలన్న తపన నన్ను మరింత వ్రాయడానికి పురి గొల్పింది, అప్పుడే దైనా కథ కూడా వ్రాయాలనిపించిరది. అప్పుడు మా ఊరిలో మా యింటి పక్కనున్న అమ్మాయి వాళ్ళఊరు వాళ్ళమ్మతో వెళ్ళిందట:__పెళ్ళికి పిలవగా! అదేమి అదృష్టమో గాని, వెళ్ళినమ్మాయికి సంబంధం కుదిరిందట!

అంతే! మాటలయ్యాయి. సంబంధం ఖాయం చేసారట అదే పెళ్ళితో పెళ్ళి కూడా అయిందట, ఇది నిజంగా జరిగింది. పెళ్ళయింతర్వాత మా ఊరు వచ్చారు.

నా కప్పటికి ఏ కథకీ థీమ్ దొరక్క సతమతమవుతూంటే తళుక్కున ఓ మెరుపు మెరిసినట్టయింది. ఏం, ఇదే ఎందుకు కథగా వ్రాయకూడదు? కాకపోతే ఏదో కొద్ది మార్పులు చేస్తే సరి అని 'వింత వివాహం' అన్న పేరుతో ఆ కథ పూర్తి చేసాను. ఇలా కథలూ, గేయాలు వ్రాయడం మొదలయ్యాయి, అలా వ్రాస్తూనే ఉన్నాను, కాలం సాగుతూనే ఉంది.

వయస్సుతో పాటు మనస్సులో కూడా కాస్త ఎదిగాను. కాలేజిలో జాయిను అవడం నాకేదో కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్టయింది. ఊరు చివర ఉండడంతో అక్కడ ఎంతో ప్రశాంతంగా ఉండేది. అక్కడ వ్రాయడం మొదలెట్టాను. వ్రాసే ధ్యాసలో నన్ను నేను మరచి పోయాను. నిర్మలనే నా క్లాస్ మేట్ వచ్చి నన్ను దేపనిగా గమనిస్తోంది. ఏదో ఆలోచిస్తూ తల పైకెత్తాను. అంతే: ఎదురుగా నిర్మల నిర్మలంగా నన్ను చూసి నవ్వింది: చూపూ చూపూ కలిసింది. ఆ కళ్ళలో ఉంది ఎంతో ప్రశాంతత. ఆ నవ్వుల ధ్వని వేయి కోయిలలను మించిన మధుర, సుందర, సంగీత మిళితంగా ఎంతో లయబద్ధంగా ఉన్నట్టనిపించింది. తళుక్కున ముత్యాల్లా మెరిసాయామె పలువరసలు, నాలో ఏదో భావ సంచలనం కలిగింది. ఇద్దరి కంఠాలు మూగ వోయాయి ఏం మాట్లాడాలో అర్థంకాలే దిద్దరికీ, అంత వరకూ కళ్ళతోనే మాట్లాడుకో సాగా మిద్దరమూనూ.

చివరికి నేనే కాస్త ధైర్యం చేద్దామనుకున్నా కాని, కంఠం బొంగురు పోయింది. ఏదో అన్నా ఆ మైకంలో! నేనేమన్నానో నాకే వినిపించలే! ఆమెకు వినిపించిందో ఏమో ఒక్కసారి కిలకిలా నవ్వింది అబ్బ మళ్ళీ అదే నవ్వు ఎంత చక్కగా నవ్వుతుంది: ఆమె నవ్వుతోంటే రెండు సొట్టలు స్పష్టంగా అగుపిస్తోన్నాయి. ఆ నవ్వును యింత వరకూ నేను మరిచి పోలేదంటే నమ్మండి, ఆ నవ్వులోని ఆకర్షణ నన్నాకట్టుకుంది, ఆ నవ్వుకు నేను బంధీనయ్యాను

బనియన్ల తయారింపులో
మా ప్రత్యేక తయారింపులు
★ గాయత్రి ఫైన్ - సరైన కొలత
★ విస్పా ఫైన్ - సరైన కొలత
★ T.N.H స్పెషల్ - సరైన కొలత
★ హాంక్ కాంగ్ - (రీసైజు)
★ నైలాన్ బనియన్లు (రీసైజు)
TRADE MARK
తయారించువారు:
దినంజప్పా హొజియరీస్ తిరుపూరు-2

ఆంధ్రా మరియు ఒరిస్సా జిల్లాలకు ఏజెంట్లు:
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం.

ఆ నవ్వుకి గులాముగా తల ఒగ్గాను. ఆ నోటికి నేను ఎదురు చెప్పలేనంత బలహీనుణ్ణయ్యాను. ఆ నవ్వుకోసం రోజూ ఎదురు చూసె వాణ్ణి, కాని, ఎలా కుదురుతుంది? నాలోని బలహీనత నన్ను ఆడిస్తోంది. వెళ్ళి ఒంటరిగా ఉన్నప్పుడు అడిగెయ్యాలనిపించింది.

ఓ రోజు ఆ అవకాశం చిక్కింది! అంతే! యింతకు మించి వేరవకాశం రాదని నా హృదయం చెబుతోంది మనో వేదనను భరించలేక! కానీ, ఎలా అడిగేది? ఏమనడిగేది? చివరికి ఎలా అయితేనేం ధైర్యం చిక్కబట్టుకొని 'నిర్మలా' అని పిలిచాను. పలకలేదు, ఛ. ఆ పిలుపు తనకే వినపడలా, ఆమెకెలా వినిపిస్తుందనుకొని కాస్త గొంతు పెంచి 'నిర్మలా' అన్నాను తక్కున వెనుతిరిగి చూసింది. చటుక్కున వచ్చి చెంపమీద ఛెళ్ళుమనిపించిందనుకున్నాను. గుండెలదిరాయి, వొళ్లు తూలింది, సంబాళించుకున్నానెలాగో. అనుకున్నది జరక్కపోవడమటుంచి మళ్ళ మొదట్లోలా నవ్వింది. అబ్బ! మళ్ళీ అదేనవ్వు, నాలోని భయానపు చేష్టలు గాల్లో అవిర్లయి పోయాయి. ఆ నవ్వులో ఏదో ఆకర్షణ ఉంది. ఆ నవ్వును చూస్తూ, ఆ కంఠాన్ని వింటూ జీవితం గడిపెయ్యొచ్చనిపిస్తుంది.

దగ్గర కొచ్చింది నిర్మల "ఏమండీ" మళ్ళ ఏదైనా కథగానీ గేయం గానీ వ్రాశారా? నాకు చాలా యిష్టమండీ కథలు వ్రాసే వారంటే! ఆరోజు మీరు వ్రాసింది యిస్తే చదివిచ్చేస్తానంది. నిశ్చేష్టుణయ్యాను 'నేను కథలు వ్రాస్తానని నిర్మలకెలా తెలిసింది' ఛ! నా పిచ్చిగాని ఆ రోజు దానివల్లే కదా ఈ పరిచయం అని నన్ను నేను నిమిత పరుచుకున్నాను. అడిగిన మాట గుర్తుకొచ్చి తొట్రుపడ్డాను.

ఓ అదా! ఆఁ! ఏదో వ్రాశాలెండి! నాదీ ఓ కథలేనా!" అన్నాన్నేను. 'అవేమి మాటలండీ? వ్రాస్తున్నవారు అలా నిరుత్సాహ పడకూడదు' అంది.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు నాకు. ఆ రోజు పోస్టు చేద్దామనుకున్న రెండు కథలూ మూడు గేయాలు ఇచ్చాను.

థ్యాంక్స్ చెప్పి వెళ్ళింది.

మరునాడు ఏవేవో పొగిడేస్తోంది. నాకేమీ వినిపించటంలా! ఆమె పెదవుల కదలిక ఆ నవ్వు మినహా నాకేమీ కనిపించడంలా!

"అనుభవం లేని సాహిత్యం లెండి" అన్నాన్నేను.

"భవిష్యత్తులో మీరు పెద్ద రచయితలవుతారు. మీరు నీరుగారి పోకండి" ఆశీర్వదిస్తున్నట్లు అంది.

"ఇంకా ఏమైనా వ్రాసి ఉంటే యివ్వండంది. చూస్తానన్నాను—ఏమనాలో అర్థంకాక!

ఇలా అయితే లాభం లేదు. "ఏమండీ! మీరు నన్ను ప్రేమిస్తున్నారా?" అని ఎలాగోలా అడిగెయ్యాలనిపించింది. కాని, నిర్మల నన్ను సదుద్దేశ్యంతో చూస్తోంటే నేనసభ్యంగా ప్రవర్తించడం సత్ప్రవర్తకుని లక్షణం కాదనిపించింది. ఎందుకో నా పిరికితనాన్ని చూచి నాకే నవ్వొచ్చిందా క్షణాన ఇక జాప్యం చేసి లాభం లేదనుకొని. ఆత్మ స్థైర్యంతో ధైర్యాన్ని కూడ గట్టుకొని అడిగాను.

నా కళ్ళలోకి సూటిగా చూచింది. ఆ క్షణాన ఆ చూపు తట్టుకోలేక పోయాను. దిక్కుతోచక దిగంతాల్లోకి చూశా ఆమె నిశ్చయమేమై ఉంటుందో ఊహించుకుంటూ.

"చూడండి! నేను మిమ్మల్ని రచయిగా అభిమానించానే తప్ప అన్యథా కాదు. అలాఅని మీ వ్యక్తిత్వం తప్పుదారిన పోతోందని కాదు నా అంచనా. మిమ్మల్నింత వరకూ ఆదృష్టితో చూడలేదు, మీరు నన్ను పార్థం చేసుకున్నారు." అంది జీరవోయిన కంఠంలో, కనుకొలకుల్లో నీరు నిండడం నేను గమనించక పోలేదు, ఏ క్షణంలో రెప్ప వాల్చినా కన్నీటి బొట్లు ఆమె వక్షస్థలం మీద పట్టం ఖాయం!

నాల్లో దుఃఖము నిండింది, నిబ్బరించుకున్నా "నిర్మలా! నేను మాత్రం నిన్ను మరవలేను ఎప్పటికైనా నీవు ఆలోచించు కాని ఒక నిర్ణయానికిరా ఇకనుంచైనా... పోనీ నిర్మలా... బాధపడకు మనస్సు నొప్పించినందుకు నన్ను క్షమించు" అన్నాను.

"మీకలా సూటిగా సమాధానం చెప్పినందుకు నాకే చాలా బాధగా ఉంది" అంది. వెళ్ళిపోయాము యిళ్ళకు.

అంతటితో పరీక్షలయ్యాయి మాకు వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది. అంతే అప్పటికీ, యిప్పటికి కలుసుకోలేదు అడ్రసిచ్చి వచ్చాను ఈ ఊరు కాని, ఉత్తరం వ్రాయలేదు కారణమేమో గానీ నాలోని ఆ వేదన మనఃక్లేశానికి దారి తీసింది. ఏమిటో నాకతీతమైన శక్తి నన్నాడిస్తోందనిపించింది ఆమెను మరవలేక, దుఃఖ భారంతో హృదయం క్షోభిస్తోంది ఆదే యితివృత్తంగా చేసుకుని "సమాంతర రేఖలూ" అన్న నవల వ్రాశాను అందులోని నిర్మల పాత్రకే ఆ నవల అంకితం చేసాను అందుకే!

ఆ నవల నా మనోవేదనకు, ఆత్మక్షోభకు ఏ కాస్తయినా తృప్తి నిస్తోందనుకుని వ్రాశాను కానీ, ఆ నవలని చూస్తున్నకొద్దీ నా కప్పటి స్మృతులు-నన్ను అంతకు మదిరెట్లు దుఃఖింప చేసాయి.


ఏది ఏమైనప్పటికీ నా లవ్ ట్రాజడీని యథాతథంగా చిత్రించిన నవలే 'సమాంతర రేఖలు'.

ఆ నవలవల్ల నా కింత పేరురావడం, మీరింతగా అభిమానించడం, నన్నిలా సన్మానించడం నా కెంతో ఆనందంగా ఉంది. మీకు చెప్పవలసింది కేవలం కృతజ్ఞతలు మాత్రమే! అంతకు మించి నేను ఏమీ చెప్పలేని, చెయ్యలేని దుర్బలుణ్ణి అని కంటనీరు పెట్టుకున్నాడు రచయిత-'సారథి'.

సభలోని వారందరికీ దాదాపు కళ్ళ నీళ్ల పర్యంతమయింది పాపం అయనను చూస్తే!

రచయిత కేసి సానుభూతిగా చూశారు సభికులు.





'అనసూయ'

పని పాటా చేతకానివాడని, ఎందుకూ పనికిరానివాడని తన అన్నగారిచేత చీవాట్లు తిని-అలిగి ఇంటి నుంచి వెళ్ళిపోవాలనుకున్న అమాయకుడు పరశురాముడు బ్రతుకుబాటలో మరో మలుపు దైవలీలగా తిరిగింది! హఠాత్తుగా ఆ ఊరికంతటికి మహాత్ముడయి-ఇంటా బయటా ప్రత్యక్షదైవమయ్యాడు! ప్రతిరోజూ ఎందరో భక్తులు వచ్చి అతన్ని దర్శించుకొని సేవించుకోవడం ఆచారమై పోయింది!—

'బాబూ, తమరు పిలిస్తేనే ఆమ్మోరు పలుకుతుందట!?' అని ఒక భక్తుడు ప్రశ్నిస్తే—

'బాబూ! అమ్మోరు యాడుంటుంది? ఎలా వుంటుంది?' అంటూ మరో భక్తుడు తనకు కలిగిన అనుమానాన్ని ఆశ్చర్యాన్ని వెలిబుస్తుంటే, యిలా ప్రశ్నవర్షం కురిపిస్తున్న అమాయక భక్తులకేసి పరశురాముడు మందహాస వదనంతో చూస్తూ—

'అమ్మవారు ఎలా వుంటుందా! ......... ఆమె కనిపించదు! కనికరిస్తే తనకుతానే దర్శనమిస్తుంది... చూడగలిగితే రాతిలోనూ ఉంటుంది! నాతిలోనూ ఉంటుంది! .........ఎవరెలా చూడాలనుకుంటే— ఆ రూపంలో కనిపిస్తుంది! ఆమె సర్వాంతర్యామి. ఎక్కడ కావాలనుకుంటే అక్కడ దర్శనం లభిస్తుంది! ఆమెలా—ఈమెలా—నా అలిలా'...

అంటూ అక్కడే కూర్చున్న తన భార్య అనసూయను కూడా చూపించాడు అందరికీ. అతని వేదాంత ధోరణికి భక్తులు ఆశ్చర్యపోయారు! పరవశించిపోయారు.

'ఆలిలో అమ్మోరిని చూస్తున్నారు గొప్పోరు! కాదా గొప్పోరు!'